క్లుప్తంగా

బోర్డు ఉత్తర్వుల మేరకే పొగాకు ఉత్పత్తి



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

గోపాలపురం: పొగాకు బోర్డు అనుమతుల మేరకే రైతులు పొగాకు ఉత్పత్తి చేయాలని గుంటూరు పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్ అన్నారు. పొగాకు పంట నియంత్రణపై గోపాలపురం పొగాకు వేలం కేంద్రం వద్ద మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చైర్మన్ యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ ఒక్కో పొగాకు బ్యారన్‌కు 4,120 క్వింటాళ్లకు మించి పొగాకు ఉత్పత్తి చేయరాదన్నారు. అంతకుమించి ఉత్పత్తి చేసే రైతుల వద్ద నుంచి అపరాధ రుసుముతో పొగాకు కొనుగోలు చేస్తామన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేయాలని సూచించారు. పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్ ఆర్ఎల్‌వీ ప్రసాద్, వేలం నిర్వహణాధికారి అమూల్ డీ శ్యామ్, రైతు సంఘం నాయకులు ఇల్లూరి రాంబాబు, గద్దే శేషగిరిరావు, పిన్నమనేని మధుమోహన్, కూసం రామమోహన్‌రెడ్డి, పొగాకు రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ నూతన టౌన్ ఫీడర్ ఆర్డీఎస్ఎస్ పనులు జరుగుతున్నందున బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు చాగల్లు మండల సమావేశం

చాగల్లు: చాగల్లు మండలం పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో ఎ. శ్రీదేవి మంగళవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షత వహిస్తారన్నారు.

తాడిమళ్లలో తాటాకిల్లు దగ్ధం



కాలిపోతున్న తాటాకిల్లు

నిడదవోలు రూరల్: విద్యుదాఘాతంతో మండలంలోని తాడిమళ్ల గ్రామంలో మంగళవారం రాత్రి తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ గ్రామంలోని దిరుసుమల్లి నాగేశ్వరరావుకు చెందిన తాటాకు ఇంటిలో అల్లుడు, కుమార్తె బండి శ్రీను, దేవి నివాసం ఉంటున్నారు. విద్యుదాఘాతం వల్ల ప్రమాదవశాత్తూ జరిగిన ఈ ప్రమాదంలో ఇంట్లోని విలువైన మంచం, ఫ్రిజ్‌తో పాటు గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. రూ.2 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని, కట్టుబట్టలతో మిగిలామని బాధితులు వాపోయారు. నిడదవోలు ఫైర్ ఆఫీసర్ జె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు.

రేషన్ బియ్యం కొనుగోలు చేస్తే చర్యలు

నిడదవోలు రూరల్: రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని కొవ్వూరు డివిజన్ సివిల్ సప్లయిస్ అధికారి ఎం.నాగాంజనేయులు హెచ్చరించారు. మండలంలోని సూరాపురం గ్రామంలో రేషన్ బియ్యం కొనుగోలు చేసే ఇళ్లు, రైస్ మిల్లులు, కోళ్లఫారాల్లో సివిల్ సప్లయిస్ అధికారుల బృందం మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూరాపురంలో రేషన్ బియ్యం అక్రమ నిల్వలు ఉన్నట్టు వచ్చిన సమాచారంతో జిల్లా అధికారుల ఆదేశాలతో తనిఖీలు చేశామన్నారు. ఈ బృందంలో నిడదవోలు, రాజానగరం, పెరవలి, కొవ్వూరు, దేవరపల్లి సివిల్ సప్లయిస్ డీటీలు ఎం.అనిల్, జి.బాపిరాజు, ఎస్ఎస్ సుధీర్‌రెడ్డి, ఎం.సునీత, ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు మంగళం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 'సురక్ష' పేరుతో పల్లెల్లో వైద్య సేవలు
- ఉచితంగా పరీక్షలు, మందులు సైతం పంపిణీ
- కూటమి ప్రభుత్వంలో కనిపించని శిబిరాలు
- గ్రామాల్లో విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు



గత ప్రభుత్వంలో నిర్మించిన తాడిమళ్ల పీహెచ్‌సీ నూతన భవనం



నిడదవోలు మండలంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం (ఫైల్)

నిడదవోలు రూరల్: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలకు వైద్య నిపుణులు హాజరై, 14 రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేసేవారు. అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారిని సమీపంలోని ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్‌కు రిఫర్ చేసేవారు. దీంతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేవి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య సేవలను గాలికి వదిలేయడంతో సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రజలకు దూరమైంది. ఏదైనా అత్యవసర వైద్యసేవలు అందాలంటే భారంగా మారింది.

సచివాలయాల పరిధిలో..

కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో పల్లె వైద్యం పడకేసింది. గ్రామీణులు ఆధునిక వైద్య సేవలకు దూరమవుతున్నారు. వ్యాధులొస్తే నిడదవోలు, తణుకు, రాజమహేంద్రవరం పరుగు పెట్టాల్సి వస్తోంది. నిడదవోలు నియోజకవర్గంలో తాడిమళ్ల, సమిశ్రగూడెం, ఉండ్రాజవరం, వేలివెన్ను, కానూరు, పెరవలి, మార్కొండపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. గ్రామీణులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేష కృషి చేసింది. ప్రతి సచివాలయం పరిధిలోనూ ఆరోగ్య సురక్ష పేరుతో వైద్య శిబిరాలు నిర్వహించి, వైద్య నిపుణులతో రోగులకు సేవలు అందించడమే గాకుండా మందులు కూడా ఉచితంగా అందించారు. ఒకవేళ ఆపరేషన్ అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా చేయించుకునేందుకు వీలుగా సిఫారసులు చేసేవారు. పిల్లలు, గర్భిణులు, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, కిడ్నీ, గుండె, ఎముకల సంబంధిత రోగులకు కార్పొరేట్ ఆసుపత్రుల, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల వైద్యులను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు రప్పించి ఉచితంగా వైద్యసేవలు అందించారు. ప్రతి వైద్య శిబిరానికి సుమారు ఐదుగురు స్పెషలిస్టు వైద్యులతో పాటు స్థానిక ప్రభుత్వ వైద్యులు హాజరయ్యేవారు. సాయంత్రం వరకూ వారు శిబిరంలో అందుబాటులో ఉండి 14 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించే వారు. హృద్రోగులకు శిబిరంలోనే ఈసీజీ కూడా తీసేవారు. ఈ విధంగా దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారికి నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తెచ్చింది.

పీహెచ్‌సీల్లో రోగుల రద్దీ

ఇటీవల కురిసిన వర్షాలకు నీటి కలుషితమై సీజనల్ వ్యాధులు విజృంభించాయి. పారిశుధ్య నిర్వహణ కొరవడడంతో పల్లెలో దోమల బెడద ఎక్కువైంది. నిడదవోలు మండలం కోరుపల్లిలో మూడు డెంగీ జ్వరాల కేసులు నమోదై ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం పొందుతున్నారు. సమిశ్రగూడెం, తాడిమళ్ల పీహెచ్‌సీల పరిధిలో రోజుకు 100 మందికి పైగా జ్వరాలతో పాటు ఇతర వ్యాధులకు సంబంధించి ఓపీ నమోదవుతోంది.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గ్రామీణ వైద్యాన్ని గాలికొదిలేసింది. గ్రామాల్లో ఎక్కడా వైద్య శిబిరాలను నిర్వహించడం లేదు. దీంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. డెంగీ, మలేరియాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోంది. గత ప్రభుత్వం అమలు చేసిన మంచి కార్యక్రమాలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ముందుకెళుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు మేలు చేసే ఇలాంటి వైద్య శిబిరాలను మళ్లీ నిర్వహించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పేదలు ఇబ్బందులు పడుతున్నారు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లు వైద్యానికి పెద్దపీట వేసింది. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి మందులు అందించేవారు. దీంతో ఈ శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఇప్పుడు వైద్యశిబిరాలు లేవు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వైద్య శిబిరాలు మళ్లీ ఏర్పాటుచేయాలి.

– అంబటి గోపమ్మ, సర్పంచ్, కోరుమామిడి

సీజనల్ వ్యాధులపై అవగాహన



సీజనల్ వ్యాధులు వస్తే వెంటనే ఎలా వ్యవహరించాలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అవసరమైన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. 104 ద్వారా గ్రామాల్లో క్రమం తప్పకుండా వైద్యసేవలు అందిస్తున్నాం. ప్రత్యేక వైద్యశిబిరాల నిర్వహణపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు. గ్రామాల్లో వ్యాధుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– టి.ఆంధ్రా, పీహెచ్‌సీ వైద్యాధికారి, తాడిమళ్ల

వైఎస్ జగన్‌ను కలసిన నిడదవోలు కౌన్సిలర్లు



మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, కౌన్సిలర్లు




జగన్‌మోహన్ రెడ్డిని సత్కరిస్తున్న తోట రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు

నిడదవోలు: నిడదవోలు మున్సిపల్ కౌన్సిలర్లు మంగళవారం మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జి. శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలను చర్చించారు. జగన్‌ను కలిసిన వారిలో రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, ఎస్‌కే వజీరుద్దీన్, పువ్వల రతీదేవి, కొత్తపల్లి సుప్రియ, బిర్రె పార్వతి, గుర్రం శాంతిశ్రీ, పిట్టా పద్మావతి, తొలేటి ఝాన్సీరాణి, పడాల శిరీష, మొదలవలస నాగమణి, అహ్మదున్నీషాబేగం, ఆలమూరి భారతి, ఆకుల ముకుందరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, దాకే అనిల్‌కుమార్, పార్టీ నాయకులు ఉన్నారు.

తాళ్లపూడి/కొవ్వూరు/చాగల్లు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆ పార్టీకి చెందిన జిల్లా నాయకులు మంగళవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జగన్‌కు కలిసిన నేతల్లో ఆ పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంధ్రోతు సురేంద్రకుమార్ తదితరులు ఉన్నారు. పార్టీ కొవ్వూరు నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను తోట రామకృష్ణ ఈ సందర్భంగా జగన్‌కు వివరించారు. కొందరు నాయకులు వెళ్లినంత మాత్రాన పార్టీకి నష్టం లేదన్నారు. తామంతా మీ వెంటే ఉంటామని స్పష్టం చేశారు. పదవులు పొందిన వారే వైఎస్సార్ సీపీని వీడారని, నాయకులు, కార్యకర్తలు మాత్రం పార్టీకి ఎల్లప్పుడూ అండగానే ఉన్నారన్నారు. అనంతరం జగన్‌మోహన్ రెడ్డిని తోట రామకృష్ణ శాలువా కప్పి సత్కరించారు. జగన్‌ను కలసిన వారిలో పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, పార్టీ కొవ్వూరు మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు చిట్టూరి అన్నవరం, సురేష్, జుట్టా ఏడుకొండలు ఉన్నారు.

నల్లజర్లలో ఎన్‌సీసీ క్యాడెట్ల మార్చ్‌ఫాస్ట్



నల్లజర్లలో జాతీయ సమైక్యతా ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

నల్లజర్ల: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ఎన్‌సీసీ లక్ష్యమని 19వ ఆంధ్రా బెటాలియన్ కల్నల్ అమిత్‌పాండే అన్నారు. పూర్వపు ఉభయ గోదావరి, పూర్వపు కృష్ణా జిల్లాలకు చెందిన 624 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు ఈనెల 12 నుంచి స్థానిక ఏకేఆర్జీ హైస్కూల్ మైదానంలో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఎనిమిదో రోజైన మంగళవారం ఎన్‌సీసీ క్యాడెట్లు నల్లజర్ల గ్రామంలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కల్నల్ అమిత్ పాండే మాట్లాడుతూ పాఠశాలస్థాయి నుంచే సైన్యంలో చేరేలా విద్యార్థులను ప్రోత్సహించడం, క్రమశిక్షణ, దేశభక్తి గల పౌరులుగా యువతను మలచడమే ఎన్‌సీసీ ఉద్దేశమన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు ఇంతవరకూ ఆర్మీలో నిర్దేశించిన డ్రిల్, మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రైనింగ్ శిక్షణ పూర్తయిందన్నారు. ట్రైనింగ్‌కు సంబంధించిన విషయాల్లో క్యాడెట్లకు రాత, మౌఖిక పరీక్షలు జరుగుతాయన్నారు.ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు గ్రేడుల వారీగా సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు. మార్చ్‌ఫాస్ట్‌లో ఏకేఆర్జీ విద్యాసంస్థల చైర్మన్ చావా గోఖుల్, కరస్పాండెంట్ వడ్లమూడి రామారావు, హైస్కూల్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు, డిగ్రీ,ఫార్మసీ ప్రిన్సిపాల్స్ శివరామ్, నల్లజర్ల సాయికృష్ణ, ఎస్ఐ సోమరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీమా ప్రీమియం చెల్లింపునకు 21 వరకూ గడువు

దేవరపల్లి: జీడిమామిడి పంటకు వాతావరణ ఆధారిత పంటల బీమా ప్రీమియం చెల్లింపు గడువును ఈ నెల 21 వరకూ పొడిగించినట్టు జిల్లా ఉద్యానాధికారి బి.సుజాత కుమారి తెలిపారు. ఈ నెల15తో ముగిసిన గడువును 21 వరకూ పొడిగిస్తూ ఉద్యానవన శాఖ డైరెక్టరేట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని ఆమె తెలిపారు. జీడిమామిడి పంట సాగు చేసే రైతు ప్రతినిధుల అభ్యర్థన మేరకు గడువు పొడిగించినట్టు ఆమె తెలిపారు. సర్వర్ సమస్య వల్ల బీమా ప్రీమియం చెల్లింపు జిల్లాలో ఆలస్యంగా జరుగుతోందన్నారు. ఇప్పటి వరకూ 37 మంది రైతులు బీమా చేయించుకున్నట్టు తెలిపారు. ఎకరాకు రూ.1500 ప్రీమియం చెల్లించాలని ఆమె రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈకేవైసీ చేయించుకున్న ప్రతి రైతు బీమాకు అర్హులేనని తెలిపారు. రైతు ఆధార్, బ్యాంకు ఖాతా పుస్తకం తీసుకుని వీఏఏ, వీహెచ్ఏలను సంప్రదించాలని సుజాత కుమారి సూచించారు.

ఉచిత ఇసుక రవాణాను అడ్డుకుంటే చర్యలు

- జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు
- బల్లిపాడు ఓపెన్ ర్యాంపు పరిశీలన
- కాంట్రాక్టర్ అక్రమాలపై టీడీపీ నాయకుల ఫిర్యాదు



బల్లిపాడు ఓపెన్ ఇసుక ర్యాంపు వద్ద వివరాలు సేకరిస్తున్న జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు

తాళ్లపూడి: స్థానిక వీఆర్వో అనుమతితో తమకవసరమైన మేర ఇసుకను ప్రజలు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఓపెన్ రీచ్‌ల నుంచి ఉచితంగా తీసుకు వెళ్లవచ్చని జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు స్పష్టం చేశారు. దీనిని ఎవరైనా అడ్డుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మండలంలోని బల్లిపాడు ఓపెన్ ఇసుక ర్యాంపును మంగళవారం జేసీ చిన్న రాముడు పరిశీలించారు. ఈ ర్యాంపులో ఇసుక తవ్వకాలు, రవాణా ప్రారంభించేందుకు గల సాధ్యాసాధ్యాలను పరిశీలించినట్టు ఈ సందర్భంగా ఆయన చెప్పారు. వేగేశ్వరపురం, చిడిపి ర్యాంపుల నుంచి ఇసుక తవ్వి స్టాక్ పాయింట్‌కు తరలించేందుకు కాంట్రాక్టర్లు ఖరారయ్యారని చెప్పారు. నిబంధనలకు లోబడి ఇసుకను డంప్ చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కాగా కాంట్రాక్టర్లు ఇసుకను ట్రాక్టర్లతో స్టాక్ పాయింట్‌కు తరలిస్తూనే కొంతమేర బయట విక్రయిస్తున్నారని ఈ సందర్భంగా బల్లిపాడుకు చెందిన టీడీపీ నాయకులు మద్దుకూరి శంకరం, జగదీష్, రమేష్‌లు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అంతే గాకుండా ఇదే అంశంపై టీడీపీ నాయకులు కాంట్రాక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. ఇసుక తవ్వకాలపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని వారు డిమాండ్ చేశారు. ఇసుక అక్రమ విక్రయాలపై ఎస్పీ నరసింహ కిషోర్‌కు కూడా టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ వెంట కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, డిప్యూటీతహసీల్దార్ మోహన్ భారతి, ఆర్ఐ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పంచాయతీ తీర్మానాలకు విలువ లేదా?

- వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధుల నిర్ణయాలను పట్టించుకోరా?
- ఎంపీడీవోను ప్రశ్నించిన ఆ పార్టీ ఎంపీటీసీలు, సర్పంచులు



తాళ్లపూడిలో ఎంపీడీవో వెంకటరమణతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు

తాళ్లపూడి: పంచాయతీ సమావేశాల్లో, గ్రామసభల్లో తాము తీసుకునే నిర్ణయాలకు విలువ లేదా? అని వైఎస్సార్ సీపీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం తాము చేసిన తీర్మానాలను కాదని టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల నోటి మాట ప్రకారమే అభివృద్ధి పనులకు తీర్మానాలు ఇవ్వడం ఏమిటని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వైస్సార్ సీపీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మంగళవారం తాళ్లపూడిలో ఎంపీడీవో బి.వెంకటరమణను కలసి, తాము తీసుకున్న నిర్ణయాలు విలువైనవి కావా?, తాము ప్రజాప్రతినిధులం కామా? అంటూ నిలదీశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పలు పనులకు తీర్మానాల పరంగా జరుగుతున్న పరిణామాలపై ఎంపీడీవో వెంకటరమణకు వారు వివరించారు. మండల సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు, వేగేశ్వరపురం సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు, గజ్జరం సర్పంచ్ గండి రాంబాబు, వైస్ ఎంపీపీ కోదాటి కనకం, ఎంపీటీసీ సభ్యుడు గుంటు చిన్నబ్బాయి తదితరులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి విషయంలో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు గాని, ఆ పార్టీ సర్పంచులు గాని తీసుకునే నిర్ణయాలను గాలికొదిలేసి, టీడీపీ ప్రజా ప్రతినిధుల, నాయకుల మాట ప్రకారం అభివృద్ధి పనులకు తీర్మానాలు ఇవ్వడం ఏమిటని వారు ఎంపీడీవోను ప్రశ్నించారు. సర్పంచులకు, ఎంపీటీసీ సభ్యులకు విలువ లేకుంటే పాలక వర్గాలు అన్నింటినీ రద్దు చేసేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీడీఓ వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించబోమన్నారు. అభివృద్ధి పనుల విషయంలో అందరి సహకారం ఉండాలన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

- జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్
- తాళ్లపూడి పోలీస్ స్టేషన్ సందర్శన



తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

తాళ్లపూడి: సారా అమ్మకాలు, మద్యం బెల్ట్ షాపుల నిర్వహణ, పేకాట వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ హెచ్చరించారు. తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించిన ఎస్పీ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణపై ఆరా తీశారు. ప్రతి పోలీసు స్టేషన్ లోనూ సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పేద కుటుంబాలను ఇబ్బందుల్లో పడేసే వ్యసనాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై గట్టి నిఘా పెట్టామని చెప్పారు. కార్యక్రమంలో కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు, ఎస్‌బీ సీఐ శ్రీనివాసరావు, తాళ్లపూడి ఎస్సై టి. రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు: యువతను లక్ష్యంగా చేసుకుని వివిధ రకాల ఆశలు చూపించి సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ హెచ్చరించారు. సైబర్ నేరాలపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో అవగాహన సదస్సు నిర్వహించారు.సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. వాట్సాప్‌లో వచ్చే అనవసరపు లింకులను క్లిక్ చేయడం ద్వారా ఎందరో మోసపోతున్నారన్నారు. లాటరీ, ఉద్యోగాల పేరిట సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నందున, ప్రజంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొవ్వూరు రూరల్ సీఐ కె.విజయ్‌బాబు, పట్టణ సీఐ పి.విశ్వం, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పరిమి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలతో దిగుబడుల అంచనా



రావిమెట్లలో పంటకోత ప్రయోగాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

నిడదవోలు రూరల్: పంట కోత ప్రయోగాలతో దిగుబడులను పక్కాగా అంచనా వేయగలమని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. మండలంలోని రావిమెట్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పల్లంట్ల కోట సత్యవతి పొలంలో నిర్వహించిన పంటకోత ప్రయోగాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ పంట కోత ప్రయోగంలో వచ్చిన దిగుబడుల ఆధారంగా రైతులకు పంటల బీమా అమలు చేస్తామన్నారు. ఖరీఫ్‌లో ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించాలని రైతులకు సూచించారు. రబీకి రైతులు పూర్తిగా సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఏవో జి.సత్యనారాయణ, ఏఎస్ఓ ఎం.రాజు, ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా కో-ఆర్డినేటర్ బయ్యే ప్రశాంత్, మండల కోఆర్డినేటర్స్ వై.శివకృష్ణ, బి.మంగరాజు, రైతులు వెలగన సూర్యారావు, ఆర్.సత్యనారాయణ, వరద వీర్రాజు, పల్లంట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.